క్లుప్తంగా

నేటి నుంచి గృహసారథులకు శిక్షణ

ఎస్.రాయవరం : ప్రభుత్వం 2024 ఎన్నికలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని, గ్రామాల్లో కన్వీనర్లు, గృహసారథులను నియమిస్తున్నట్టు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మంగళవారం తెలిపారు. ఎస్.రాయవరం మండలంలో సచివాలయం కన్వీనర్స్, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నుంచి గోకులపాడు పాలసొసైటీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని చెప్పారు.

మడుతూరులో నూకాంబిక అమ్మవారి పండగ


నూకాంబిక అమ్మవారి సన్నిధిలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మడుతూరు గ్రామంలో మంగళవారం నూకాంబిక అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీపీ భర్త కోన బుజ్జి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు మోటూరు సంజీవి, జువ్వాల నాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


దుర్గాదేవి ఆలయంలో పూజలు

మునగపాక : తోటాడ–గవర్ల అనకాపల్లి సరిహద్దులోని దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి కేవీవీ శివ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. విశ్రాంత తహసీల్దార్ కాండ్రేగుల సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేత కాండ్రేగుల చిన అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆంజనేయస్వామికి పూజలు


స్వామిని దర్శించుకున్న భక్తులు

పాయకరావుపేట : పాల్తేరు గ్రామంలో అభయ ఆంజనేయస్వామికి గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట చేసి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


వెల్చూరులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాంబిల్లి : వెల్చూరులో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ(ఏపీసీఎన్ఎఫ్) ప్రతినిధులు అవగాహన కల్పించారు. నవ ధాన్యాలు సాగు–నేల తల్లి బాగు నినాదంతో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేంద్రియ ఎరువులు వినియోగంతో కలిగే ప్రయోజనాలు, రసాయన ఎరువులు వినియోగంతో కలిగే అనర్థాలను ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధులు వీరబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజిబిజీ


ధాన్యం ఎగురబోత పనుల్లో రైతులు


వరి నూర్పిడి పనుల్లో రైతులు

- జోరుగా వరి నూర్పులు
- ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు
- వరి ఎండుగడ్డికి డిమాండ్

రాంబిల్లి : వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలో ఏడాది 5600 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి సాగును చేశారు. ఖరీఫ్ వరి కోతలు అనంతరం అపరాలు(పెసర, మినుము) పంటలను రైతులు సాగు చేశారు. మరి కొందరు రైతులు రబీ సీజన్‌కు సంబంధించి వరి పంటను సాగు చేస్తున్నారు. సుమారు 2300 ఎకరాల్లో రబీ వరి సాగు చేశారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్ల కేంద్రంతో పాటు ప్రయివేటు వ్యాపారులు జోరుగా


ట్రాక్టర్‌లో వరి ఎండు గడ్డిని తరలిస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్లు జరుపుతున్నారు. అయితే ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లు ఈ నెల 15 తో నిలిపివేస్తారని వ్యవసాయ అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఆర్ జీఎల్ రకంతో పాటు ఎంటీయూ 1224, ఎంటీయూ 1262, ఇంద్ర తదితర రకాలను రైతులు సాగు చేశారు. వరి నూర్పిడి పనుల్లో రైతులు యంత్రాలను వినియోగిస్తున్నారు. అక్కడక్కడ పశువుల సాయంతోనూ నూర్పిడి పనులు జరుపుతున్నారు. మరో పక్క వరి ఎండుగడ్డికి డిమాండ్ ఉంది. ఎకరాలో పండించిన వరి పంటకు సంబంధించి నూర్పిడి పనుల తర్వాత గడ్డిని రూ.6వేలు వరకు అమ్ముతున్నారు. గడ్డి వ్యాపారులు గడ్డికోసం నూర్పిడి పనులను ఉచితంగా చేస్తున్నారు. వరి ఎండు గడ్డిని పలు ప్రాంతాలకు ట్రాక్టర్ల సాయంతో తరలించి వ్యాపారాలు సాగిస్తున్నారు. ధాన్యంతో పాటు గడ్డి సైతం వెంటనే అమ్మకాలు జరిగిపోతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అణుకు రోడ్డులో తప్పని అవస్థలు


అణుకు వెళ్లే రహదారి

కోటవురట్ల : మైదానమైనా ఆ గిరిజన గ్రామానికి వెళ్లాలంటే ప్రత్యక్ష నరకాన్ని చవిచూడాల్సిందే. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆ గిరి పుత్రుల కష్టాలకు అంతే ఉండడం లేదు. ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ ప్రధానంగా రహదారి సమస్యతో గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. గొట్టివాడ శివారు పచ్చని కొండల నడుమ ఉన్న ఆ గిరిజన గ్రామం అణుకు. ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లాలంటే గతుకులు, రాళ్లు తేలిన రహదారిలో సుమారు 6 కిలోమీటర్లు ప్రయాణిస్తే అణుకు గ్రామం వస్తుంది. ప్రస్తుతం రహదారి మొత్తం రాళ్లు తేలి నడిచే వీలు కూడా లేనంతగా తయారైంది. రోడ్డు బాగోలేకపోవడంతో ఆటోలు తిరగడంలేదు. వివిధ అవసరాల నిమిత్తం గిరిజనులు మండల కేంద్రానికి వెళ్లాలంటే కాలినడకే శరణ్యం. ఇక గ్రామంలో ఎవరికైనా వ్యాధులు వస్తే ఆస్పత్రికి వెళ్లడానికి నానా అవస్థలు పడతారు. గర్భిణులకు డోలీ మోత తప్పడంలేదు. అధికారులు స్పందించి ఈ రహదారికి మోక్షం కలిగించాలని గిరిజనులు కోరుతున్నారు. తారురోడ్డు వేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

మహిళల ఆర్థిక భరోసాకు ఎన్నో పథకాలు


మాట్లాడుతున్న సర్పంచ్ పిన్నంరాజు వాసు

అచ్యుతాపురం(అనకాపల్లి): డ్వాక్రా మహిళలు ఆర్థిక సాంత్వన చేకూరేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని నరేంద్రపురంలో మంగళవారం నిర్వహించిన డ్రాక్రా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీనిధి రుణాలు, సున్నా వడ్డీ రుణాలు, రుణమాఫీ వంటి పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా చేయూత పొందాలని ఆకాంక్షించారు. ఎంపీటీసీ రావినాగలక్ష్మి శోభన్‌బాబు, డ్వాక్రా అధికారులు చిన్ని తల్లి, కోదండరాం, డాక్రా మహిళలు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన చెంగల

పాయకరావుపేట : మండలంలో గల పెదరాంభద్రపురం గ్రామంలో ఇల్లు కాలిపోయిన బాధితులను మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు మంగళవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన ఏడిద నాగేశ్వరరావు, అచ్చారావులకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. దీంతో నిరాశ్రయులైన ఆ కుటుంబాన్ని చెంగల వెంకట్రావు పరామర్శించి 25 కేజీల బియ్యం అందించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గంపల సత్యనారాయణ, కాకాడ దాసు, గంపల సుబ్బారావు, మన్నియ్య, శీలి నూకరాజు, పార్టీ కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కోనవానిపాలెంలో...

ఎస్.రాయవరం : కోనవానిపాలెం గ్రామంలో రెండు రోజులు క్రితం అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన


అగ్ని ప్రమాద బాధితులకు రైస్ బ్యాగ్ అందిస్తున్న చెంగల వెంకట్రావు

బాధితురాలు కొర్ని గురువులమ్మను మంగళవారం మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు పరామర్శించారు. 25 కిలోల బియ్యం అందజేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే తక్షణ సహాయం వెంటనే అందేలా చేస్తామని హామీ ఇచ్చారు.

హౌసింగ్ రుణాలు సత్వరం మంజూరు చేయాలి

పాయకరావుపేట : హౌసింగ్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరమే రుణాలు మంజూరు చేయాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల సమావేశంలో హౌసింగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇసరపు పార్వతీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు గ్రామాల్లో సమస్యలు సభ దృష్టికి తీసుకొచ్చారు. పాల్మన్‌పేటలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, జగనన్న కాలనీకి కేటాయించిన స్థలంపై నెలకొన్న సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ కోటేశ్వరరావు కోరారు. హౌసింగ్ జియో ట్యాగింగ్ సమస్య గురించి ప్రశ్నించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ

పంచాయతీరాజ్ శాఖ బిల్లులు త్వరగా చెల్లించాలని, బోర్ల మరమ్మతులు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. అధికారులు స్పందిస్తూ మండలంలో 13 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయని, తాగునీటి సమస్య పరిష్కరిస్తున్నామని తెలిపారు. మండలంలో మంగవరం, గోపాలపట్నం, సత్యవరం, మాసాహేబుపేట గ్రామాల్లో కోతుల బెడద అధికంగా ఉందని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తెలిపారు. ఆర్ అండ్‌బీ స్థలాలను ఆక్రమించి చేపడుతున్న ప్రైవేటు కట్టడాలు, నిర్మాణాలపై దృష్టి సారించాలని సభ్యులు కోరారు. సమావేశానికి రెవెన్యూ, ఎక్సైజ్, ఆర్‌టీసీ, తాండవ సుగర్స్ నుంచి అధికారులు హాజరు కాకపోవడంపై జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ ఎంపీడీవోను ప్రశ్నించగా, ఆయన సమావేశానికి రాని అధికారులతో ఫోన్‌లో సంప్రదించారు. రెవెన్యూ శాఖ నుంచి డిప్యూటీ తహసీల్దార్ ఆలస్యంగా సభకు హాజరయ్యారు. వైస్ ఎంపీపీలు మణికంఠస్వామి, ధనిశెట్టి మాధవి, ఎంపీడీవో సాంబశివరావు, మండల అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం ఐక్యంగా ఉద్యమించాలి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న దళిత బహుజనపార్టీ నాయకులు

ఎస్.రాయవరం : దళితులు రాజ్యాధికారం సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని దళిత బహుజన పార్టీ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు ఏనుగుబల్లి భాస్కర్ అన్నారు. అంబేడ్కర్ సందేశ్‌యాత్రలో భాగంగా పెదగుమ్ములూరు గ్రామంలో మంగళవారం సమావేశమయ్యారు. గ్రామంలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దళితుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు ఉంటున్నాయని, వాటిని అధిగమించే విధంగా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీద్, పాయకరావుపేట నియోజకవర్గ నాయకులు చిరుకూరు అర్జున్‌రావు, సెక్కల సూరిబాబు, బోడపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గణిత శాస్త్ర అభ్యసన అభివృద్ధిపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక : గణితం బోధించే ఉపాధ్యాయులు మరింత పట్టు సాధించాలని ఎంఈవో వేణుగోపాలరావు కోరారు. గణిత శాస్త్ర అభ్యసన అభివృద్ధిపై మునగపాక, పరవాడ, అచ్యుతాపురం మండలాల్లో 6,7,8 తరగతులు బోధించే గణిత ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయులు మరింత నైపుణ్యం పెంచుకోవాలన్నారు. గణితంలో మెలకువలను తెలుసుకొని విద్యార్థుకు సులభంగా బోధించాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం సూర్యానారాయణ, రిసోర్స్ పర్సన్ నాయుడు, సీఆర్పీలు అచ్యుతకృష్ణ, నూకేష్, గోవింద పాల్గొన్నారు.

క్రీడల ద్వారా శారీరక దృఢత్వం


మాట్లాడుతున్న ఎస్ఐ ఈశ్వరరావు


మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

యలమంచిలి : క్రీడలు ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం పెంపొందుతుందని యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో శ్రీచైతన్య టెక్నో స్కూల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మీట్‌ను ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మట్లాడుతూ చిన్నతనం నుంచి క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు మానసికంగా ఉల్లాసంగా ఉండి, చదువుపై కూడా ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వం పాఠశాలలో క్రీడల్లో తప్పనిసరిగా తర్ఫీదు నివ్వాలని ప్రతి స్కూల్లో ఆట స్థలాలు ఉండేటట్లు చూస్తోందని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చేసిన మార్చ్‌ఫాస్ట్, డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్ఐ రమణ, ప్రిన్సిపాల్ రుషికేస్‌దాస్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక : ఈ నెల 18న మునగపాక మెయిన్‌రోడ్డులోని శ్రీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో జరిగే శివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో మంగళవారం రాత్రి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. 18వ తేదీన ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అదే రోజు రాత్రి 7గంటలకు రేలారేలారే జానపద గీతాల ప్రదర్శన జరుగుతుందన్నారు. 19న ఉదయం 9.48 గంటలకు పెండ్లిరాట, 23న ఉదయం 11.22 గంటలకు విశాలాక్షి విశ్వేశ్వరుల కల్యాణం జరుగుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబునాయుడు, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు పాల్గొన్నారు.


మహా శివరాత్రి పోస్టర్ ఆవిష్కరిస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

వాటర్ ప్లాంట్ సీజ్

మునగపాక : నాణ్యతా ప్రమాణాలు పాటించని మండలంలోని అరబుపాలెం గ్రామంలోని వాటర్ ప్లాంట్‌ను అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఐఎస్ఐ గుర్తింపు లేకుండా వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నట్టు గుర్తించిన అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, ఆహార భద్రతా అధికారి రవికుమార్‌లు పలు తనిఖీలు నిర్వహించి ప్లాంట్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు.

మై హోమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

యలమంచిలి : సేవా కార్యక్రమాల్లో మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమన్యం ముందుంటుందని ఫ్యాక్టరీ వైస్ చైర్మన్ విహెచ్ చౌదరి పేర్కొన్నారు.మంగళవారం యలమంచిలి మండలంలో ఉన్న పురుషోత్తపురం, కొత్తలి, పద్మనాభరాజుపేట, ములకలాపల్లి, మన్యంపాలెం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, ఎంపీయూపి పాఠశాల విద్యార్థులకు మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎల్.వి. ప్రసాద్ ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య బృందంతో వివిధ పాఠశాల నుంచి 209 మంది విద్యార్థులకు ఉచిత వైద్య, కంటి పరిక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ చైర్మన్ వి.హెచ్.చౌదరి మాట్లాడుతూ మైహోమ్ ఆధ్వర్యంలో యలమంచిలి మండలంలోని గ్రామాల్లో పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాలు, కొన్ని పాఠశాలలో


విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చౌదరి

మౌలిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్ ప్రియ, డాక్టర్ నరేష్‌కుమార్, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు, యలమంచిలి మండలం ఎంఈవో విశ్వనాథం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు గొన్నాబత్తుల శివ, మొగలపల్లి సత్యనారాయణ, ఫ్యాక్టరీ డీజీఎం ఎల్. శ్రీనివాసరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

కొత్తపట్నంలో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

రాంబిల్లి : కొత్తపట్నం గ్రామంలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. పరిసరాల పరిశుభ్రతకు గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ చోడిపిల్లి పార్వతి కోరారు.

డ్రైనేజీలో పూడిక తొలగింపు

మునగపాక : పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నామని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని 7వ వార్డులో డ్రైనేజీలో పేరుకుపోయిన సిల్టు తొలగింపు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. వీధుల్లో దోమల బెడద లేకుండా సిల్టు తొలగింపు చేపడుతున్నామన్నారు. పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలన్నారు.

వైభవంగా శూలాల సంబరం

నక్కపల్లి : మండలంలో చుక్కలవాని లక్ష్మీపురంలో శూలాల సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీభద్రావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శూలాల సంబరాన్ని సోమవారం అర్థరాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నాలుకపై శూలాలు గుచ్చుకుని ప్రభలు చేతపట్టుకుని ఆలయం ముందు నృత్యాలు చేశారు. ఈ శూలాల సంబరాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఆలయం వద్ద రాత్రంతా తిరునాళ్లు జరిగింది.

వాడ్రాపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు


రోగులకు మందులు అందజేస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫ్యామి లీ డాక్టర్ విధానం సేవలను ఆయన పరిశీలించారు. ఈ విధానంలో ఇంటివద్దకే వైద్యులు వచ్చి ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. డాక్టర్ భవానీ, వైద్య సిబ్బంది, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు పరిశీలించిన డీవైఈవో

నక్కపల్లి : మండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో లిప్ కార్యక్రమంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను యలమంచిలి డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. అభ్యసనాభివృద్ధి కార్యక్రమంపై ఉపాధ్యాయులకు ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి వారీగా విశ్లేషణ చేసుకుని విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు 43 మంది సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, ఏడుగురు ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో డీవీడీ ప్రసాద్, డీఎల్‌పురం హెచ్ఎం వేమగిరి నూకరాజు, రీసోర్స్ పర్సన్ కోట్ని సత్తిబాబు పాల్గొన్నారు.


శిక్షణ తరగతులనుద్దేశించి మాట్లాడుతున్న డీవైఈవో

జగనన్న గోరుముద్ద విద్యార్థులకు వరం


తిమ్మరాజుపేట హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద పరిశీలిస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక : జగనన్న గోరు ముద్ద పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. మంగళవారం తిమ్మరాజుపేట హైస్కూల్‌లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు జగనన్న గోరుముద్ద పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కొత్త మెనూ ద్వారా విద్యార్థులకు మెరుగైన పోషకాహారం అందుతుందన్నారు.